


# గొడ్డ దొంగ

అలికిడైతే 'ఎవడ్రాడు' అంటన్నాడు నాగడుగాలికి సెట్టల్లాడి. నా పైకి లేత్తన్నాడు.సీవ సీటుక్కుమంటే సాలు బయటికొత్తన్నాడు.సుట్టూ సూత్తన్నాడు.

ఆకంటికి కునుకు లేదు. కంట్లో వొత్తులేసుకున్నాడు. సత్తే పాడుకోడు. ఇంట్లో కిరసనాల బుడ్డి. గుడ్డెలుతురు. సుట్టూ సీకటి. కన్నుబొడుసుకన్నా కానరాదు.


పొద్దుగుంకి మూడుజావులయింది. ఊరు సద్దుమణిగి రొండు జావులు దాటుది. తెల్లారటానికి జావ్ పొద్దుంది. నాగడు నిద్దరబోతే ఒట్టు. కాటి కాపరోడికి మల్లే బాచి పట్టేసుక్కూసున్నాడు. అదాడిల్లే. ఒంటినిట్టాడిల్లు. దెయ్యాల్దిరిగే సోటు. పిలిత్తే పలికే నా కొడుకుండడు. సావదెంగి సెవలు మూసినా దిక్కూ మొక్కూ ఉండదు.

ఆడసలే రాకాసోడు. ఆడి జోలికెవుడూబోడు. వచ్చేడా, సచ్చేడే. వాడి మాటెవుడెత్తడు. ఆణ్ణోరెత్తేడా అమ్మనా బూతులే. కంపునోరు. ఆణ్ణోట్టో ఎవుడూ నోరు బెట్టడు. కంపు, ఆడంటే మాటలా, అమ్మకు మొగుడు.

ఇంట్లోంచి పొడుసుకొచ్చేడు నాగడు. సేను గనిమ లెక్కేడు. పిల్లకాలవమీద పంగజాపి అడుగేసేడు. కాలవ గట్టెక్కేడు.

ఎక్కి సుట్టూ బారజూసేడు. కంటికేవీ గనపళ్ళా. అటెవుడూ రాలా, పోలా, కాలవగట్టుమీద బళ్ళ బాటలో కుంచేపు కూసున్నాడు, కాలవ గట్టునానుకుని మఱ్రిసెట్టు. సెట్టుకింద సప్తా, పక్కన గట్టుగొయ్యి. గడ్డి మేట మీదకుఱ్ఱ. తెల్లారితే దాన్ని గొయ్యాల.

గొడ్ల దొంగ



పాగులెయ్యాల. అమ్మాల. అది ఆడిపని. బతుకుదెరువు. రోజిడిసి రోజు కొయ్య దూణ్ణి గోత్తాడు ఆడి పొట్ట గడవాల. దున్నకుర్రంటే గిరాకీ. దాని పొట్టగోత్తే ఈడి పొట్ట నిండుద్ది.

ఆడు మిడిగుడ్లోడు. ఎర్రగుడ్లు. పోతురాజు గుడ్లకు మల్లె ఉంటై, పొగులు జూత్తే రేత్తిరి కల్లోకొత్తాడు. ఆణ్ణి పిల్లా జల్లా జూత్తే జొరవొచ్చి మంచవెక్కాల్సిందే! ఆడి దెబ్బంటే గోలుకొండబ్బా అనాల. అట్టాటోడు. ఆడెంతెత్తు? అంతెత్తు! సెయ్యెత్తు మనిషి.

ఆడప్పుడు పల్లెలోనే ఉండేవోడు. సెప్పులు గుట్టి పొట్ట బోసుకునేవోడు. కిర్రు సెప్పులు గావాలంటే ఆడికాడికేసచ్చినట్టు రావాల. ఆడి పంతనవే పంతనవ్.

మెట్ట పొలాలోళ్ళు మోట గుట్టిచ్చాలంటే ఈడేడుండాడావటాని యెతుక్కుంటా రావాల్సిందే. ఎంతటోడయినా, సిటికలో సిటికంటే సిటికలో మోటగుట్టేవోడీడు.

డబ్బున్న నాయాళ్ళు తాతాలు బిల్లాలు బాటలు బొటాలు బెట్టుకుని సెప్పులు గుట్టి అమ్ముకుంటుంటే బతక్కొండ్రా నా కొడుకుల్లారా అని పంతిత్తి పన్రాయితోపాటు అటకెక్కించేడు, అటికెప్పుడో గాని పన్రాదు.

దున్నకుర్ర కాళ్ళు గట్టి మెడిరగదీసి, గొంతు గొత్తంటే సూసిన సిన్నోడు ఉచ్చబోసుకుని, జొరం దగిలి, మంచం బట్టి, కలవరిచ్చి కలవరిచ్చి, మంచం దిక్కుండానే వొలుకుల్లోకి బొందల్లోకి సేరిపోతే, ఆడెమ్మ, నాగణ్ణనరాని మాటలని, అమ్మోరింటికి బొయ్యి, మల్లిటురిగి సూత్తే, మింటి సుక్కలు మంటిలో బడ్డట్టే. రాలా ఈడూబోలా. పిలుసుకురాలా.

అంతే. అదీణ్ణొదిలేసిందో, ఈడు దాన్నొదిలేసేడో గాని, అది ముండా మొయ్‌లా. ఈడి మొల్‌తాడూ దెంచలా, ఈ ముండమోసొడికి మళ్ళీపెళ్ళీలే. పెటాకుల్లే.

ఈడు గొడ్డుగోసేటప్పుడు పిల్లోళ్ళు దడుసుకుంటున్నారావటానంటే, అళ్ళ మీదా, అళ్ళ పిల్లోళ్ళ మీద, ఆడికిది బుట్టి, యెట్టయితే అట్టాగే కాన్ లెమ్మని సేలో ఇల్లేసుకుని బతుకు ఎల్లమారుత్తాన్నాడాడు.

ఆడ ఆడి దొక్కడిదే యిల్లు. సుట్టూ కొంపాలే గోడూలే. అల్లంత దూరంలో పల్లె. తెల్లారితే పల్లె యిల్లు. రేత్రే, వల్లకాడు. సావు.పిలిసినా పల్లె పలకదు. ఉలకదు. వినపడదు. కనపడదు. పొగులంత దగ్గిరా, రేత్రంత దూరవ్.

ఆడు బళ్ల బాట మీంచి లేవలా. కుందుగూసున్నోడు, అట్టాగే సచ్చుబడ్డాడోకిడి మల్లె ముడుసుక్కుసున్నాడు.

తెల్లోళ్ళని ఎల్లగొట్టాలని తెనాలి రైల్ టేసున్ని తగలబెట్టినప్పుడీడు గొడ్డకాడ బుడ్డోడు. ఈడాడికి యెట్టా బోయేడా యేందోగాని కిరసనాల డబ్బా మోసేడు. తీగల్దెంచేడు.

పోలీసోళ్ళు తుపాకుల్దెచ్చేరు, కాలుత్తారన్నప్పుడు. ఈ డొక్క దూకుతో కటేరం మీదగా లగెత్తి, పొలాల కడ్డంబడి మురుక్కాలవలో ఈది పల్లెల్లో బడ్డాడు. ఊరికీ పల్లెకీ అంతదూరం ఉండడం అంగలకుదిటికే సెల్లింది.

అమొయ్‌న ఆడికైదు పొగళ్ళూఐదు రేత్రుళ్ళు ఒకటే జొరం. మూసినకన్ను దెరగలా.

తిండిలే తిప్పల్లే. అద్దె మద్దెపు నా కొడకా నువ్వెందుకాడికి బోయేవురా అని అయ్య తిట్టినా తెల్దు. తిమ్మినా తెల్దు. ఇవరం తవరం తెలీన్నాకొడుకీణ్ణెందుకాడికీ బొనిచ్చేవే నీయమ్మ అవటాని ఆళ్ళమ్మందిట్టినా తన్నినా ఈడికేందీ తెల్దు.

ఆ రోజుల్లో గూడు సొగెనల్లోంచి దెంకొచ్చిన దుప్పట్లు సినిగినయ్ సినిగిపోగా ఇంకా రొండాడి దగ్గర మిగిలుండాయి. ఎర్రంచు నల్ల దుప్పట్లు. ఉన్నివంటే ఉన్నివే. ఎచ్చగుండేయి. సలిగాదు, దానెమ్మయినా బయింలేదు. సిరుగు పట్టవు, ఒకపట్టాన పోవు.

ఈడసలే అమాసనాడు బుట్టినోడు. ఆమాసెకు మల్లేనే ఉంటాడు. అడుకొక దుప్పటా, అదీ నల్లటిదా, ఇంకేం సీకట్లో సీకటికే మల్లె ముడుసుక్కుసున్నాడీడు.

మూణ్ణాళ్ళు ముసురుబట్టి నిన్నే తెరిపిచ్చింది గానీ సలి దగ్గలా ఈగవ. తడారలా. ఇంకా కాలవగట్టు బురద బురదగానే ఉంది.రేగడి బురద. సచ్చినెద్దు మొండెం కదిలినట్టయితే గుడ్లు మిటకరిచ్చి సూసేడు నాగడు. ఈడు కదల్లా. పల్లికాయలకుమల్లె గుడ్లిచ్చుకొని తేరిపారజూసేడు. మొండెం కదిలినట్టే అనిపించింది. ఈడేం మాట్లాళ్ళా.

దొంగనాకొడుకుచ్చినంటుండాడు.అట్టా, అనుకొన్నాడీడు. కదల్లా. అలికిళ్ళే.

ముసురుకుముసిలెద్దుజత్తే బండిగట్టి తోలుకొచ్చి కాలవగట్టు మీద, మర్రి సెట్టుకింద సష్టా పక్కన తోడిసిపోయేడు రైతు.

పొద్దుబోయిందిగానీ లేపోతే మొండెంతోలొలిసి, సలపతీసి,దట్టెం కాలవలోకి తోసేసేవోడే నాగడు. ముసిలెద్దువొంట్లో గుప్పెడు మాసం లేదు. అంతా తోలుఎమికలు పొట్ట. తోల్లప్ప ఇంకేవీ పనికిరాదు. సచ్చిన గొడ్డు రైతుకుదొడ్డోంచి పోవాల. నాగడికి తోలుగావాల. కాలవ దట్టెం మింగాల.

సచ్చిన ముసిలెద్దు మొండెం మోసుకొచ్చిన పొట్ల గిత్తలు ఏవనుకొంటయ్యా ఎప్పుడు కన్నా తెలుస్తుందా.

బతుకంతా బతికి నూకల్జెల్లిన దాపటెద్దు మొండెం సూసిబతుకంతా ముందుందనుకొనే కుర్ర దూడ పొద్దునే సావక తప్పనీ, పేదోళ్ళ తిండికాక తప్పదనీ అనుకొంటే ఎట్టుంట ఎవుడుకన్నాఅంతుబట్టుద్దా?

సచ్చిన గొడ్డు గోసి, తోలూ, బాగుంటే మాసపూ తీసుకొని దట్టెం, సొట్ట, పాడూ, పరదేసు కాలవలో బారేత్తె అన్నీ కొట్టుకపోతయి. రాయి గట్టైత్తే కాలవలో తేలకుండా పోతై. ఎండా కాలవ్ కాలవలో పడ్డ అంక సెండాల వంతా, నీళ్ళొదలినప్పుడు కొట్టుకుపోద్ది.

అప్పుడొకళ్ళూ, ఇప్పుడొకళ్ళూ వొచ్చి. అదరిద్దరవంతా కాలవలో దిమ్మరిచ్చొద్దురా అంటే ఇంటానికేదేవన్నాఅల్లాటప్పా నాకొడుకా, ఇనడు.ఈడి పనిడిదే. ఆళ్ళ మాట లాళ్ళయ్యే.

మూడు జావులు మేల్కొన్న ఆడి మెలకవకి మేలు జరిగినట్టుగా ఎద్దు మొండెం పక్కనున్నట్టుండి కుంచెం కదలిక. రవ్వంత అలికిడి.ఈడు గుడ్లు మిటకరిచ్చి సూసేడు. నిగిడిచ్చి సూసేడు.

ఈ మద్దెన గొడ్ల దొంగతనాలెక్కువయ్యేయి. గొడ్లు దోలుకుపోట వెక్కువయింది. ఎవుడు జేత్తన్నాడో, ఎట్టా జేత్తన్నాడో ఎవుడికీ అంతుబట్టలా. దొడ్లుల్లో గొడ్లు బోతున్నై. సావిళ్ళ గొడ్లు బోతన్నై.పోయిన గొడ్డేవయిపోతన్నాయో తెలియదు. ఎంతెతికినా అయిపు లేకుండా పోతన్నయి. అజా పజా లేకుండా అవుతున్నయి. పత్తా ఉంటే వొట్టు.

దొంగ గొడ్లు గోసి, అమ్మేసి, ఆటి అయిపు లేకుండా సేత్తన్నారని జవన్ గుబ్బట్టాడేరు. సెవులు గొరుక్కున్నారు.

అనువానమ్ నాగడి మీదకొచ్చి పడింది. ఆడు కోసిన గొడ్లు తల్లూ, తోళ్ళూ, కాళ్ళూ, గిట్టలూ తడివి తడిని సూసేవోళ్ళు. నాగడు రావ రావ అంటే ఇనేవోళ్ళు గారు. గొడ్లుగొన్న వోటు. అమ్మి నోడు, కాయిదా బేరగాడు, మారుబేరగాడు అన్నీ ఆరా దీసేవోళ్ళు. అందరూ ఆడికండగా ఉండబట్టి సరిపోయింది గానీ లేకపోతే తిప్పల్దప్పేయి కావు. అంతా సావే! ఆడికొచ్చిన డోకా లేదుగానీ, అనువానవే, అవదానైన బిడ్డ, ఆకల్లే,అల్లాడిపోయేడు.

లేనోడందరికీ అలుసే. అణ్ణందరూ దొంగ, దొంగగా, దొంగనాకొడుకుం జూసినట్టు జూత్తంటే ఏడుపొచ్చి సి(రైత్తుకొచ్చి తెల్లోళ్ళని తరవటానికి తెనాలి రైలుటేషను గాలిసినట్టు, ఈళ్ళని తరవటానికేం గాలసాలాని దిక్కుల్జూసేవోడు నాగడు.

పేదోడి కోపం పెదిమికి చేటు.మాటంటే తప్పు, పెదిమి గొరుక్కుంటే ముప్పు. మాట్లాడితే సిక్కు. నోరు మూస్తే తంటా, తెరిస్తే తంటా, ఆసావు సచ్చినోడికి తెలుసుద్దిగానీ సెప్తే తెల్దు. మొన్నటికి మొన్న పొద్దున్నే గోద్దావని తోలుకొచ్చి కట్టేసుకున్నకుర్ర దూణ్ణి.ఒకరేత్తిరేల గొడ్ల దొంగొచ్చి మెడపాలుపుతో తోలుకుపోతే తానేడిసిన ఏడుపువొదారిసినోడే లేడు. అప్పటినుంచి నాగడి మీద అనువానవ్ తగ్గితే తగ్గిందేవోగానీ సుప్తాగా పోలే.

ఆ గొడ్ల దొంగకి పేదోళ్ళ గొడ్డే గావాల. పేదోడి పెళ్ళం వాడకట్టుకు మరదలన్నట్టు బీదోళ్ళ గొడ్డే ఆడు దోలుకుపోతన్నాడు.

పేదోళ్ళ గొడ్లు బోతే పోలీసోళ్ళు గూడా బట్టిచ్చుకోరు. అడిగేవోడూ లేడు. సెప్పేవోడూ

లేడు.

దొంగ గొడ్డు కబేళాకి బోతన్నయ్యని అనుమానవేగానీ రుజువేందుంది? ఆడికి పోయేవోడూ లేడు. సేసేవోడూ లేడు. సూసినా సెప్పేవోడూ లేడు. ఇనేవోడూ లేడు. దొంగ దొరకడు. అసల్దొంగే లేడు. దొంగెవుడో, ఏవూరోడో, యెట్టుంటాడో, ఏందీ తెల్దు.

నాగడి కొయ్య బొయ్యే దూడబోతే పొయ్యి బండెడ్లు, దుక్కిటెడ్లు బోతే ఏం గావాల? రైతు బతుకేంది? కాళ్ళూ సేతులాడవు. ఆ సావు సావుగాదు.

నాగడి అనుమానమే నిజమయింది.మొండెం కాణ్ణుంచి ఆకారం గొర్రె పొట్టేలుకు మల్లే పోతురాజు బలి మేకకిమల్లే లేత కుర్రదున్నకి మల్లే నాలుక్కాళ్ళ మీదుండడం, వానపాం పాకినట్టు పాకటం నాగడు సూణ్ణే సూసేడు.

ఆకారం దూడ దగ్గిరకొచ్చింది. కట్టుగొయ్య తాడిప్పింది. తాడుపేతబట్టుకోంగానే, నాగడు ఎనకపాట్నొచ్చి, ఎనకాలగా వాటేసుకుంటే కింద బడి మీదబడి, పొర్లి, దొర్లి నిలబడ్డారు.

ఆచ్చెర్రం, దొంగ కూడా మణిసే!

కట్టగొయ్యతాడు ఆడిసేతులకేసి కట్టేడు నాగడు.

పొలుపు కొన దూడ మెళ్ళో ఉంది. కొయ్య కొన దొంగసేతుల కట్టుయింది. ఆడు లగెత్తాలంటే దూడా పరుగెత్తాల. సుతి గుదర్లా. ఆడు పోబోయి పడ్డాడు. నాగడు కప్పుకొన్న దుప్పటి ఆడికాళ్ళ గట్టేడు.

ఆడిక్కాళ్ళూ సేతుల్లెవ్వగానీ నోరూ వాయీ లేనోడు గాడే. కానదేందో ఆడరవటల్లా.

ముకంలో ముకం బెట్టి సూసినా సీకట్లో ఆడెవుడో తెలీలా.

నాగడాణ్ణి ఒకట్టలే" నువ్వెవుడివిరా? నా దూణ్ణెం దుకిప్పా"

"వొరే నాగ్గా", గొడ్డ దొంగ మండిపడ్డాడు.

నాగడు గురుతుబట్టాడు.

"నువ్వా దొరా? యేందీ పని?" మెత్తపడ్డాడు.

"వదల్రా నా కొడక. కట్టిప్పు, నరుకుతా నా కొడక. ఇప్పరా నీయమ్మ!"

"దొరా దూడ నీయబ్బ పోత్తా"

"నీయమ్మ మొగుడి సొత్తు. ఇప్పర్నాకొడక కట్టిప్పు."

నాగడికి వొళ్ళంతా సీదర.అరికాలి బురద నెత్తికెక్కుతోంది. "ధూ" అగలా.

"నీకిద్దగదు." ఊరుకోలా."పురుగులుబడి బోతావు" పైపైకొచ్చి "పేదోడి కడుపుగొడతావా? నీ కరుగుద్దా? నువ్వెట్టా తుతెల్లుతా?" తుపుక్కున ఊశాడు.

"కట్టిప్పరా మాదిగ లంజాకొడకా"

కులం పేరుతో తిట్టేతలికి నీయమ్మ అనుకున్నాడాడు. "మాటా మరేదా జాగరత" రుసరుసలాడేడు. నాదూణ్ణి దెంగటానికొచ్చి నన్నేమాటంటే పణ్ణు.

"యేం జేత్తావోయ్"

"వోయ్ గీయ్ అనొద్దరా"

"నువ్వెంత నీ బతుకెంత నువ్వేం జేత్తవురా నాగ్గా?"

"నలుగురు పెద్ద మణుసుల ముందు నీ బయిజు గడుగుతా."

"వొర్నాకొడకా, నిన్ను నాలుగు దన్ని నలుగురూ నాలుగు మాటలని. నన్నొదిలి, నిన్ను దొంగోడని, ఈ దూడ్డబ్బ నాకిప్పిత్తారు. నువ్వేం చేసుకోలేవు. ఆ నలుగురూ మా వోళ్ళురా నువ్వొక్కడివి. వొరేలమ్మీకే,రచ్చెందుకురా! కట్టిప్పు నీ దూడన్నీకిత్త!"

నాగడాలోసెనలో బడ్డాడు. నిజవే.ఉన్నోడి నేయం ఏరు, లేనోడి నేయం ఏరు, ఉన్నోడి మాట ఉన్నోళ్ళింటారు. లేనోళ్ళూ ఇంటారు. లేనోడి మాట లేనోళ్ళు ఇన్రు. ఉన్నోళ్ళూ ఇన్రు.లేనోడుఏకాకి. గొడ్డ దొంగని పడ్డ పేరు పడనే పడ్డది. గాయంలేని మచ్చ. ఆ మచ్చ బోదు. ఈ మచ్చ తిరగబడితే గాయం కాయం. ఇరుసులో కందెనికిమెల్లే వుంది యవ్వారం.

"కట్టిప్పి వొదల్రా నా కొడక".

నాగడు వదిలిపెట్టడు. వొదలకపోతే యేంజేత్తాడు. పెద్ద మణుసులకి సెప్పాలి. సెబితే అళ్ళు నేయం సెప్పరు.

వదిలేత్తే పోతాడు. ఊరికే పోతాడా? ఊరికే ఉంటాడా? నమ్మకం, ఉండదు. ఏం జేత్తాడు? కొడతాడు, సావగొడతాడు.

"వొదలకపోతే యేం జేత్తాదొరా?"

"సంపుతా?"

వదలందే యెట్టా సంపుతాడో నాగ్గాడి కంతుబట్టలా.

ఇంకా జాం గడిత్తేగాని తెల్లారదు.

నాగడి నుదుటమీదే రేపుటి పొద్దు పొడిసేసింది.

సెయ్యాలిసిన పని శానా ఉందని తెలిసొచ్చింది. గొడ్డ దొంగ ఏవంటన్నా నాగడిని పిచ్చుకోటల్లే. తన పని తాం జేసుకుపోతన్నాడు.

సచ్చిన ముసిలెద్దు మొండెం ఎల్లకిలగా విప్పి, ఎదురొమ్ముల్దగ్గిర్నుంచి ముడ్డిదాకా కడుపు మీద కత్తితో గీత గీత్తే పొట్టా పేగులూ బయటబడ్డయ్యి. ఆటిని కోసి, తీసి బక్కింగమ్మ కెనాల్లోకీడిత్తే, కాలవ నెలల మణిసికి మల్లె బరువుగా బోతా ఉంది.

ఎగిరి గుండెల మీదనినట్టు గట్టుల్ని దంతా వుంది కాలవ. పిక్కట బీర్లుగా నిండా బోతా ఉందది. ఎంత కుళ్లయినా కడుపులో పెట్టుకుంటది కాలవ.

ఎద్దు మొండెం పక్కటెముకల్ని ఇరగ దొక్కితే దాని కడుపులో సాపేసుకుని పక్కేసుకునేంత కాళీ వచ్చింది.

అలివిగాని గొడ్డును కొయ్యబోయే ముందు బాదే బడిత దెబ్బేడు నాగడు.

గొడ్డు దొంగ అమ్మనాబూతులు దిడతన్నాడు. బెదిరిత్తన్నాడు. ధాంధూం జేత్తన్నాడు.

నాగడు నల్ల దుప్పటి ఎర్రంచు జించి గొడ్డ దొంగ నోట్లో కక్కేడు. ఆడిక మాట్లాడితే వొట్టు. కాసేపుటికి కదలిక కూడా గప్పుచిప్పు.

నాగడు సచ్చిన ముసిలెద్దు కడుపు ఆరే, వారూ తెచ్చి కుట్టేసేడు.వానాకాలవ్‌బోయి సలికాలవ్‌బోయి, కాలవలో నీళ్ళింకియపోయి ఎండాకాలవ్‌లో లాకుల దగ్గర ఎద్దు దట్టెం బురదలో బయట పడింది.

ఎద్దీనిందంటే దూడను గాటగట్టమన్నట్టు మణిసినీనే యెద్దు దట్టేం లాకులికి బట్టిందని జనం ఇరగబడి సూత్తంటే నాగిడెల్లి సూపేడు.

ఎద్దు దట్టెంలో మణిసి అస్థిపంజరం. మణిసి పుర్రెలో ఎర్రంచు దుప్పటి ముక్క. నాట్నుంచి నేటి దాంకా గొడ్డ దొంగే ఐపులేడు. ★